7.3.1997 శుక్రవారం 12 పేజీలు సంపుటి:69 సంచిక:10 విడిప్రతి రూ.2.00లు Phone: 27354 Regd. No. HNL 18

# జమీన్ రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

**ఇల్లు అమ్మబడును**

నెల్లూరు టౌన్ సెంటర్, అన్నిటికి అనుకూలమైన చోట, రామలింగాపురం అండర్ బ్రిడ్జి దాటంగానే తూర్పువైపు కుడిచేతి వైపునున్న డోర్ నం.2857/16, 58 అంకణాల స్థలం, అందులోని క్రింద పైన 24 అంకణాల కట్టుబడి గల మిద్దె అమ్మబడును. వివరాలకు

ఫోన్: 29697, 27571, 28779

# కాంగ్రెస్ సమాధే వీరి లక్ష్యమా?

రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షత విషయంలో జరుగుతున్న రభస – ప్రతి కాంగ్రెస్ వాది మనసునూ వికలం చేస్తూంది! తన వ్యక్తిగత అహంకారం, తన వ్యక్తిత్వ వికారం తప్ప మరో గోల పట్టని మొరటు నాయకుడు కోట్ల విజయభాస్కర రెడ్డి ఒక ప్రక్క; తన. పదవిని కాపాడుకొనే ప్రయత్నంలో పార్టీని నట్టేట ముంచ డానికి సందేహించని సీతారాం కేసరి ఇంకొక ప్రక్క చేరి ఈ సున్నిత సమస్యను రగడగా మార్చి, రభస సృష్టిస్తున్నారు.

పిసిసి అధ్యక్షుడు శ్రీ కె. రోశయ్య చేత బలవంతంగా రాజీనామా చేయించడం విజయ భాస్కర రెడ్డిగారి రాజకీయ పైత్య ప్రకోప ఫలితమే! రోశయ్య తన మనిషి కాడని ఆ పెద్ద మనిషికి మనసులో గిలిపడిందట. తన మనిషనే కీలుబొమ్మను పిసిసి పీఠంపై కూర్చొబెట్టి – తన మాటల కనుగుణంగా ఆ బొమ్మ కాళ్లు చేతు లాడిస్తుంటే చూసి మురిసి పోవాలని మహా ముచ్చట పడిపోతున్నా డాయన.

కాంగ్రెస్ ఖర్మకాలి – విజయ భాస్కర రెడ్డిని వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించి వెళ్లాడు పివి. తన పేరు చెప్తే ఎక్కడా గుప్పెడు ఓట్లు రాలని తనను నంద్యాల నుంచి ఎమ్పీగా గెల్పించి నందుకు కృతజ్ఞతగా ఈ బహుమానం ఇచ్చాడా పుణ్యాత్ముడు. అదిప్పుడు కోతికి కొబ్బరికాయ వలె దొరికింది విజయభాస్కర రెడ్డి గారికి! కట్టెలుపోయి, కత్తి వచ్చె ఢాం... ఢాం... అని కథలో కోతి పిల్ల ఆడుకున్నట్లు – రోశయ్య పోయి పుల్లయ్య వచ్చె ఢాం... ఢాం...; పుల్లయ్య పోయి ఎల్లయ్య వచ్చె ఢాం... ఢాం... అని ఆడుకో జూస్తున్నా డాయన. నేను చెప్పిన బొమ్మను పిసిసి కుర్చీలో కూర్చోబెట్టక పోతే నీ కుర్చీ క్రింద కాళ్లు లాగేస్తానని బెదిరిస్తుండడంతో సీతారాం కేసరికి పాపం కాళ్లు చేతు లాడడం లేదు. ఆఫ్టరాల్ ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ గోదావరిలో కలిసి పోతుందని భయపడి కోట్ల వారడిగిన కోరిక తీర్చకుండా – ఈ వృద్ధాప్యంలో తనను వరించి వచ్చిన ఎఐసిసి పదవీకాంత తనను వదలిపోయే పరిస్థితి తెచ్చుకోవడం "వైజ్" అన్పించు కోదని భావించి – పిసిసి తోలుబొమ్మ లాటకు తెర ఎత్తాడు సీతారాం కేసరి. ఈ ఇద్దరు ముసలోళ్ల సయ్యాటలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సర్వనాశనమై పోతూందిప్పుడు.

**స్వంత జిల్లాలో ఎన్నికకు అభ్యర్థిని నిలబెట్టలేని హీనస్థితికి దిగజారిన విజయభాస్కర రెడ్డి– ఏ ముఖం పెట్టుకొని రాష్ట్ర పెత్తనం ఆశిస్తున్నారు?**

ఆంధ్ర దేశంలో కాంగ్రెస్ ఇప్పుడను భవిస్తున్న కడుదీనస్థితికి కారకులైన వారిలో కోట్ల వారూ ఒకరు. ఒకటికి రెండుసార్లు రాష్ట్ర ప్రభుత్వాధి కారాన్ని పళ్లెంలో పెట్టి తెలుగు దేశానికి అప్పచెప్పిన ఘనతర రాజకీయ జీవిత మాయనది. గత నలభై ఏళ్లుగా పార్టీ పుణ్యాన, విడవకుండా పదవులను భవిస్తూ కూడా – తాను పుట్టి పెరిగిన కర్నూలులో పార్టీకి ఒక అభ్యర్థిని నిలబెట్టలేని చేతకాని తనానికి ప్రతీక ఆయన. నంద్యాల పార్లమెంట్ స్థానానికి కాని, ఆళ్లగడ్డ శాసన సభసీటుకు కాని క్యాండిడేటును వెతకడం ఆయన వల్ల కాలేదు. కర్నూలు జిల్లా సమస్తంలో ఆయనకి రోజా మనిషన్న వాడులేడు. తన గ్రామంలో పంచాయితీ సర్పంచ్‌ను గెల్పించుకొనే సమర్థత కూడా లేదు. తన వాడని చెప్పుకోవ డానికి జిల్లాలో చెప్పుకోదగిన మనిషి మిగల లేదు. పిల్లకాకుల వంటి కుర్రకారు నేతలు తెలుగు దేశం జెండాను జిల్లా అంతా రెపరెప లాడిస్తుంటే – కాంగ్రెస్ పేరు విన్పడ కుండా బాంబులు వేసి, రిగ్గింగ్‌లు

కొరవ 7 పేజీలో

తల్లి కామాక్షి ఆశీర్వచనంతో పదహారేళ్ల పాటు నెల్లూరీయుల సుందర భవన నిర్మాణాలకు అతి తక్కువ ధరకు స్వచ్ఛమైన స్టీలు, సిమెంట్ అందజేసి మా వంతు కృషి చేశాం. ఇక ముందు కూడా మీ సేవ చేయగలమని ఈ 17వ పుట్టిన రోజునాడు సవినయంగా మనవి చేస్తున్నాం!

**సింహపురీయుల సేవలో పునీతులం!**
**ఆదరించిన వారందరికీ అభివందనం!!**

మార్చి 12 మాకు పుట్టిన రోజు

**కామాక్షి స్టీల్స్**

ఫోన్స్: 31389, 27687, 28142

**హోల్‌సేల్ ఇనుప వ్యాపారులు**

జి.సి., జి.పి., బి.పి., తార్ స్టీల్స్, ఆంగిల్ అయిరన్, ఛానల్స్, ఫ్లాట్స్, రాడ్స్, రౌండ్స్ మొదలగునవి. భారీ కట్టడములు, ఫ్యాక్టరీలు, థియేటర్లకు సిమెంటు అందుబాటైన ధరకు సప్లయి చేయుట మా ప్రత్యేకత.

నెల్లూరు జిల్లా డంప్ స్టాకిస్టులు: కేశోరామ్, అజంతా సిమెంట్ (బిర్లా తయారీ)

